క్లుప్తంగా

విజ్ఞాన్ నిరుల అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక తెలిపారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు భవనం నాగలక్ష్మికి కె.ఎల్.డీమ్డ్‌టుబి యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. డాక్టర్ వారణాసి భగవాన్ పరిశోధనా పర్యవేక్షణలో ఎఫెక్ట్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆన్ నానో ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచింగ్ సర్ఫేస్ ఏ న్యూమెరికల్ అప్రోచ్ అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ టీవీఎస్ ప్రసన్న, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



పొన్నూరు: పరిసరాల శుభ్రతతోనే దోమలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల వద్ద పరిశుభ్రత పాటించాలని మలేరియా అధికారి వెంకట రామయ్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో పొన్నూరులోని ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నిడుబ్రోలు, కొండముది, వెల్లలూరు, మన్నవ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలలో దోమల నివారణ, వాటి వలన ప్రబలే వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వెంకట రామయ్య మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, మలేరియా యూనిట్ సభ్యులు హరిబాబు, కోటేశ్వరరావు, జాషువా, రమేష్, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ఉచిత కంటివైద్య శిబిరం

గుంటూరు రూరల్: ప్రతి మనిషికి శరీరంలో కళ్లు ప్రధానమైనవని కళ్లను వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. గోరంట్ల గ్రామంలోని కళాశాలలో బుధవారం రెడ్ రిబ్బన్ కమిటీ ఆధ్వర్యంలో అగర్వాల్ ఆసుపత్రి నేతృత్వంలో విద్యార్థులకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళ్లు ఆరోగ్యంగా ఉంటే మనిషి మనుగడ సులువైతుందని, లేదంటే ఎంతో కష్టాలను చూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

లక్ష్మీపురం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించనున్నట్లు నగర కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభల్లో భాగంగా 23వ తేదీన ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసు, జంగాల చైతన్య, గుండెబోయిన లక్ష్మి, విరిగినేని వెంకటేశ్వర్లు,బి. వెంకటేశ్వర రెడ్డి, చినపోతుల విజయకుమార్ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న పాల్గొన్నారు.

కొల్లి శారద మార్కెట్ తరలింపు పుకార్లు నమ్మవద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని కొల్లి శారద మున్సిపల్ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ తరలింపుపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొన్ని వ్యాపార సంఘాల వారు వ్యాపారస్తులకు అసత్య ప్రచారం చేస్తున్నారని, పూర్తి అవాస్తవమని పేర్కొన్నారు. మార్కెట్‌లోని 81 షాపులకు 25 సంవత్సరాలు లీజు గడువు ముగిసినందున నిబంధనల మేరకు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు చెప్పారు. దీని వలన నగర పాలక సంస్థ చరిత్రలో రికార్డు స్థాయిలో ఆదాయం పెంచేలా వ్యాపారస్తులు భారీ సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు.

దక్కని గౌరవం.. దక్కేనా వేతనం

- ఎంపీటీసీ సభ్యులపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు
- 5 నెలలుగా విడుదల కాని గౌరవ వేతనం నిధులు
- అత్యధిక శాతం వైఎస్సార్ సీపీ సభ్యులు కావడంతో నిర్లక్ష్యం

పొన్నూరు: వారంతా ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు.. పరిపాలనా పరమైన అంశాలలో వారి ఆమోదం తప్పనిసరి. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజాస్వామ్యానికే అర్థం మారిపోయింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారికంగా పాల్గొనాల్సిన వారిని విస్మరిస్తోంది. ఎంపీటీసీలను పక్కన పెట్టి ఏ సంబంధం లేని కూటమి నాయకులు అధికారిక కార్యక్రమాలను అంతా తామై నడిపిస్తున్నారు. అధికారులు సైతం వారికే వత్తాసు పలుకుతూ ప్రొటోకాల్ కు పూర్తిగా మంగళం పాడేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను టీడీపీ కార్యక్రమాల్లాగా నిర్వహిస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా గుర్తింపు దక్కలేదు. కనీసం వారికి ఇచ్చే గౌరవ వేతనం సకాలంలో అందించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత 5 నెలలుగా ఇవ్వడం లేదు. దీనికి కారణం గత స్థానిక ఎన్నికల్లో మండలంలో అధిక స్థానాలు వైఎస్సార్ చక్కడమే. అందుకే కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ స్థానిక ప్రజా ప్రతినిధులను పక్కనబెట్టి అవమానిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.



పొన్నూరు ఎంపీడీవో కార్యాలయం

గౌరవ వేతనానికి దిక్కు లేదు

ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేల చొప్పున గౌరవ వేతనంగా అందించాల్సి ఉంది. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వారి ఒక్కొక్కరికి 5 నెలలకు రూ.15 వేల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వారిలో ఎక్కువ మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందినవారు ఉండటంతోనే తగిన గౌరవం, వేతనం అందించడంలో అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే 16 నెలల బకాయిలు రావాల్సి ఉండగా ఎంపీటీసీల ఒత్తిడి మేరకు ప్రస్తుతం 11 నెలల బకాయి నిధులు విడుదల అయినట్లు సమాచారం. అయినప్పటికీ మరో 5 నెలల బకాయిలు రావాల్సి ఉంది.

> **5 నెలల వేతనం చెల్లించాలి**
>
> 
>
> మండలంలోని ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనం ప్రస్తుతం కొన్ని నెల బకాయిలు చెల్లించాం. మరో 5 నెలల బకాయిలు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటాం.
>
> – గుమ్మా చంద్రశేఖర రావు, ఎంపీడీవో, పొన్నూరు.

ఎమ్మెల్యే నరేంద్రకు రైతుల గోడు పట్టదు

- అండగా నిలిచిన అంబటి మురళీకృష్ణపై అక్రమ కేసులు పెట్టడం దారుణం
- పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి



మాట్లాడుతున్న డాక్టర్ రూత్‌రాణి

పొన్నూరు: భారీవర్షాల కారణంగా వేలాది ఎకరాల వరి చేలు నీట మునిగి నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారి పక్షాన మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్. నల్లమోతు రూత్‌రాణి అన్నారు. ప్రజా నేత అంబటి మురళీకృష్ణ అన్న మాటలను వక్రీకరించి సమావేశాల్లో మాట్లాడి కొందరు కూటమి నాయకులు తమ ఉనికిని చాటుకుంటున్నారని విమర్శించారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రూత్ రాణి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ వరదలో నష్టపోయిన రైతులను ఆదరించాల్సి ఉండగా వారిని కనీసం పలకరించలేదని మండిపడ్డారు. వేల ఎకరాలు నీటి పాలైతే వరద ప్రభావం లేదని కూటమి నేతలు అనడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా గుంటూరు ఛానల్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టని కారణంగానే రైతులకు కష్టాలు వచ్చాయని తెలిపారు. ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన నరేంద్రకుమార్ పాలనలో చేబ్రోలులోని కొమ్మమూరు బ్రిడ్జి అభివృద్ధికి నోచుకోలేదని వెల్లడించారు. దీంతో రద్దీగా ఉండే ఆ బ్రిడ్జిపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా అంబటి మురళీకృష్ణపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకొని, రైతులకు ఎకరానికి రూ. 10 వేలు, ఎరువులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు షేక్ నాజర్ మాట్లాడుతూ పొన్నూరులో జరిగే అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు.

సమావేశంలో పార్టీ ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కె. మరియారాణి, నాయకులు మోహనరావు, మూర్తిరాజు, దేవరకొండ గోపి, రమేష్, రుద్రపాటి నాగేశ్వరరావు, దాసరి దానమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేత అంబటి మురళీ కృష్ణ పై కూటమి నేతల చేసిన తప్పుడు వ్యాఖ్యలను నాయకులు ఖండించారు.

కిట్స్ అక్షరలో తరగతులు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉద్యోగ ఉపాధి లక్ష్యంగా తమ కళాశాలలో విద్యాబోధన ఉంటుందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలోని కిట్స్ అక్షర కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల చైర్మన్, సెక్రటరీ కోయి శేఖర్‌లు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కిట్స్ యాజమాన్యంపై ఉన్న నమ్మకంతో ఈ కళాశాలను ఎంచుకున్న తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులకీ అభినందనలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇంజినీరింగ్ సిలబస్‌తో పాటు ఇన్నోవేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, రీసనింగ్, అర్థమటిక్ కోడింగ్, సాఫ్ట్‌స్కిల్స్ నేర్చుకోవాలని గత సంవత్సరం ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీలలో 120 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. సెక్రటరీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యం, క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకోటయ్య మాట్లాడుతూ 2025–26వ సంవత్సరం నుంచి మన కళాశాలకు ఆటానమస్ గుర్తింపు లభించిందని, జెఎన్‌టీయూ కాకినాడ అకడమిక్ క్యాలెండర్ను అనుసరించి తరగతులతో పాటు ఇండస్ట్రీ విజిట్, ఇంటర్న్‌షిప్లకు ప్రాధాన్యతను ఇస్తూ ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రెండవ సంవత్సర విద్యార్థులు నృత్యాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్ జి.గురుకేశవదాసు, డాక్టర్ షేక్ ఖమురుద్దీన్, డాక్టర్ బుల్లిబాబు, డాక్టర్ ఆంజనేయులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి పాల్గొన్నారు.

ఇన్నోవేషన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

గుంటూరు రూరల్: ప్రపంచ దేశాలను ఆకర్షించేలా ఏపీని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పిలుపునిచ్చారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా జరిగిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఇతర ఆవిష్కరణ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కళాశాలలో విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్ళం కళాశాలలో తరగతులు ప్రారంభం



సదస్సులో పాల్గొన్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం కళ్ళం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ యం.ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి విద్యార్థికి అవసరమైన సౌకర్యాలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళ్ళం సంస్థలు స్థాపించిన కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత సాంకేతిక విద్య, ఉపాధి కల్పన ముఖ్య ధ్యేయంగా మా కళాశాల పనిచేస్తుందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 1200 మందికి పైగా ఇంజినీరింగ్ డిగ్రీలో ప్రవేశాలు జరిగాయన్నారు. జిల్లాలోనే ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల అత్యున్నత సాంకేతిక విద్యను అందిస్తున్న ఏకైక స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలగా ఉండటం చాలా గొప్ప విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. యస్.బి.రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం తమ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన కంప్యూటర్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – డేటా సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు 20వ తేదీన, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు 19వ తేదీన అవగాహన సదస్సును జరుపుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పి.వేంకటేశ్వర రెడ్డి, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీనివాసులు, కళాశాల ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పి.ఎల్.మాధవ రావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోండి



రైతులతో వ్యవసాయశాఖ అధికారులు

- మండల వ్యవసాయ అధికారి బి.కిశోర్
- వెంగళాయపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం, చల్లావారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.కిశోర్ పాల్గొని మాట్లాడుతూ పంట విత్తిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలో వీఏఏని కలిసి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎవరికైనా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందకపోతే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ నందు నమోదు చేసుకోవడానికి ఆగస్టు 25వ తేదీ వరకూ మాత్రమే సమయం ఉందని తెలిపారు. ఎన్‌పీసీఐ ఇన్ ఆక్టివ్‌లో ఉన్న రైతులు వారికి సంబంధిన బ్యాంక్‌కి వెళ్లి ఎన్‌పీసీఐ ఆక్టివ్ చేయించుకోవాలని, లేదా భారత తపాలా కేంద్రాలలో అకౌంట్ ఓపెన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ అమౌంట్ ఆ అకౌంట్‌లో పడతాయని తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లో ఎరువులను పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల అవశ్యకతను వివరించి ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డును తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కంది మినికిట్స్ విత్తనాలు రైతులకు అందజేశారు. వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో కేజీకి రూ 5 రూపాయల రాయితీపై రూ 38 రూపాయల చొప్పున 25 కేజీల బ్యాగ్స్‌లో పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం బీపీటీ 5204, ఎంటీయూ 1224 రకాల విత్తనాలు అందుబాటులో ఉంచిందన్నారు. వెంగళాయపాలెం సీఆర్‌పీ అనసూయ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి భావి తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందివ్వాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలితకుమారి, ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆళ్ల కృష్ణమూర్తి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ వేణుమాధురి, ప్రకృతి వ్యవసాయ ఆర్‌పీ సరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులే పంటకు రక్షణ

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సూచన



నీటిలో మునిగిన మొక్కజొన్న పైరు

గుంటూరు రూరల్: అధిక వర్షాలవల్ల వివిధ దశల్లో ఉన్న పంటలు అక్కడక్కడా పాక్షికంగా, పూర్తిగా ముంపుకు గురయ్యాయి. అధిక తేమ శాతం వల్ల పూత, కాయ రాలటం, పంట పెరుగుదల కుంటుపడడంతో పాటు దిగుబడులు తగ్గి, పంట నాణ్యత కూడా లోపిస్తుంది. ఈ పరిస్థితులలో, వివిధ పంటల్లో రైతాంగం ఆచరించవలసిన యాజమాన్య పద్ధతులను పాటించి పంటలను కాపాడుకోవచ్చని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం శాస్త్రవేత్తలు వెల్లడించారు.

జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులివే..

నారు దశలో ఉన్న పొలాలు నీట మునిగితే అవి త్వరగా పుంజుకోవడానికి 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా తోపాటుగా 1 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి. పిలకలు కట్టే దశలో పైరు నీటి ముంపుకు గురైతే, నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియాతోపాటు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది. నష్టం చాలా వరకు తగ్గుతుంది. వాతావరణంలో అధిక తేమ ఉన్నప్పుడు అగ్గి తెగులు, పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు, లేదా కాసుగామైసిన్ 3 ఎల్ 2.0 మిల్లి లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పాము పొడ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మిల్లి లీటరు లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లి లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి దుబ్బు మొదలు తడిచేటట్లు 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

ప్రత్తి పంటలో...

ప్రత్తి పంటలో వర్షపు నీరు నిలబడితే పూత, పింది, కాయలు రాలిపోవడం ఆకులు ఎర్రబడి వాడిపోయి రాలిపోవడం జరుగుతుంది. రైతులు వెంటనే పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసి వేసి ఎకరానికి 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనముగా వేయాలి. వర్షం తగ్గాక అవసరాన్ని బట్టి పొటాషియం నైట్రేట్ 20 గ్రాములు లీటరు నీటికి కలిపి ఏడు నుంచి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. అధిక వర్షాల వల్ల పైరులో మెగ్నీషియం లోపం వల్ల ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి. నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో పైరుపై పిచికారీ చేయాలి. ప్రత్తిలో కాయ కుళ్ళు తెగులు, ఆకుమచ్చ తెగులు ఆశించడానికి అవకాశం ఉంది. నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

మినుములో యాజమాన్య పద్ధతులు

వర్షం ప్రభావిత పొలాల్లో అధికంగా నిలిచిపోయిన నీటిని బయటకు తీయాలి. అధిక వర్షాలతో ఇనుము లోపం వచ్చే అవకాశం ఉంది. నివారణకు అన్నభేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు 0.5 గ్రాములు లీటరు నీటికి కలుపుకుని పిచికారి చేయాలి. ఒక వారం తర్వాత, 1 శాతం 19:19:19 లేదా 1–2 శాతం పొటాషియం నైట్రేట్లతో పిచికారి చేయాలి. ఈ దశలో వేరుకుళ్ళు తెగులు ఆకుమచ్చ తెగుళ్ళను నివారించడానికి హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా ప్రొపికోనజోల్ 1 మిల్లి లీటరు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

కందిలో యాజమాన్య పద్ధతులు సూచనలు :

ప్రభావిత ప్రాంతాలలోని పొలాల్లో అధికంగా నిలిచిపోయిన నీటిని బయటకు తీయాలి. పైరులో ఇనుము లోపాన్ని సరిచేయడానికి అన్నబేధి 5 గ్రాములు, నిమ్మ ఉప్పు 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఎక్కువగా ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా బూస్టర్ మోతాదుగా వేయడం వల్ల పంట ఎదుగుదల పుంజుకుని నష్టాన్ని తగ్గించవచ్చు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులు సూచనలు

సాధ్యమైన చోట పొలాల నుంచి అదనపు నీటిని వెంటనే తీసివేయాలి. ఎక్కువ తెగుళ్లను నియంత్రించడానికి టెబ్యుకొనజోల్ 1 మిల్లీ లీటరు లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటరు, లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఇనుము లోపాన్ని సవరించడానికి అన్నబేధి 5 గ్రాములు. నిమ్మ ఉప్పు 0.5 గ్రాములు లీటరు చొప్పున కలుపుకుని పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు సూచనలు

నిలిచిన నీటిని తీసివేసిన తర్వాత, పంటపై 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది. వాతావరణంలో అధిక తేమ కారణంగా కాండం కుళ్ళు లేదా వేరుకుళ్ళు తెగు లు, గింజ బూజు తెగులు రావడానికి అవకాశం ఉంది. ఈ తెగుళ్ళ నివారణకు కార్బండెజిమ్ 2–3 గ్రాములు, లేదా మెటాలాక్సిల్ 35 శాతం డబ్ల్యూఎస్ 2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ తెలిపారు.



ఐరన్‌లోపంతో ఉన్న మినప పైరు



మెగ్నీషియం లోపంతో ఉన్న పత్తి పైరు

పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత



సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.అప్పిరెడ్డి తదితరులు

నెహ్రూనగర్: మనతో పాటు మన చుట్టూ ఉన్న సమాజం కూడా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్ష ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ల అప్పిరెడ్డి ఆకాంక్షించారు. బ్రాడీపేటకు చెందిన జీవీఎల్ జోశ్రిత అనే 8వ తరగతి విద్యార్థినికి చేయూత అందించాలని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ సంకల్పించారు. అందుకు అనుగుణంగా బ్రాడీపేటలోని కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, వెలుగూరి రత్నప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు బూసి రాజలత, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నగర అధ్యక్షుడు రవీంద్ర, పార్టీ నేతలు వలివేటి వెంకటరమణ, డేవిడ్, పొట్టూరి శ్యాం, భాగ్యారావు, దాసరి రమేష్, మహేంద్ర గులేచా, విజయ మాధవి, సత్యవతి, విజయమ్మ, కరుణశ్రీ, సింగు నరసింహారావు, కొండిన్య, సుబ్బరాజు, నవీన్, ప్రసన్న, శంకర్, నారాయణ, సుబ్బారావు, శంకర్, చందు, ఈశ్వరరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ కమిటీలు నిబంధనలు పాటించాలి

పెదకాకాని: వినాయక విగ్రహ కమిటీ సభ్యు లు నిబంధనలు పాటించి వినాయక చవితి పర్వదినాన్ని శాంతి భద్రతలతో, సజావుగా జరుపుకోవాలని పెదకాకాని సీఐ టీపీ నారాయణ స్వామి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం సీఐ మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠకు ముందుగానే పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించే ప్రదేశాలలో విగ్రహాలు ప్రతిష్ఠించరాదని సూచించారు. విగ్రహాల వద్ద 24 గంటల భద్రతను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలని కనీసం నలుగురు వలంటీర్లు ఎప్పటికప్పుడు విధులు నిర్వహించాలన్నారు. బలవంతపు వసూళ్లు నిషేధమని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విగ్రహాల వద్ద లేదా నిమజ్జన సమయంలో డ్యాన్స్ ప్రోగ్రాములు, టపాకాయలు, రంగులు చల్లడం నిషేధమని, మైక్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని, నిమజ్జనం తప్పనిసరిగా రాత్రి 11:00 గంటలలోపు పూర్తి చేయాలని సూచించారు.